సాక్షి
విజయనగరం
సోమవారం । 4 । సెప్టెంబర్ । 2023



జ్వరాలతో జాగ్రత్త..!

జిల్లాలో జ్వరాల వ్యాప్తి మొదలైంది. పల్లెలు పట్టణాల్లో జనం జ్వరాల బారిన పడుతున్నారు.

- 8లో



ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్

ప్రభుత్వ ఆస్పత్రుల్లో పని చేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించేలా బయోమెట్రిక్ హాజరును ప్రభుత్వం ప్రవేశపెట్టింది.

- 8లో



స్వయం సంపాదకులు కావాలి

దివ్యాంగులు స్వయం సంపాదకులు కావాలని ఎస్‌బీఐ కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ డీజీఎం సౌరభ్‌బాజపాయ్ అన్నారు.

- 8లో

న్యూస్‌రీల్

రామతీర్థంలో నేడు టెండర్ల ప్రక్రియ



నెల్లిమర్ల రూరల్: సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థం శ్రీసీతారామస్వామి దేవస్థానంలో తలనీలాలు, నిత్యావసర సరుకులు, కొబ్బరి ముక్కలు, పార్కింగ్ తదితర వాటికి సోమవారం టెండర్లు నిర్వహించనున్నట్లు ఈఓ కిషోర్‌కుమార్ తెలిపారు. దేవస్థాన ప్రాంగణంలో ఉదయం 10 గంటల నుంచి టెండర్ల ప్రక్రియ ప్రారంభమవుతుందని ఔత్సాహికులు హాజరు కావాలని కోరారు. ప్రసాదాల తయారీకి అవసరమైన సరుకులు పంపిణీ, భక్తులు సమర్పించిన తలనీలాలు, కొబ్బరి ముక్కలు, పార్కింగ్ స్టాండ్ నిర్వహణకు ఏడాది కాల పరిమితితో వేలం ప్రక్రియ జరుగుతుందన్నారు.

పరిశ్రమలకు ఒక రోజు పవర్ హాలీడే

● ఎస్ఈ లక్ష్మణరావు

విజయనగరం ఫోర్ట్: అధిక స్థాయి విద్యుత్ డిమాండ్, నిబద్ధత గల విద్యుత్ మూలాల నుంచి విద్యుత్ సరఫరా తగ్గుదల వలన ప్రస్తుతం రాష్ట్ర విద్యుత్ గ్రిడ్ క్లిష్టతరమైన విద్యుత్ సరఫరా పరిస్థితిని ఎదుర్కొంటుందని విద్యుత్ శాఖ ఎస్ఈ మువ్వల లక్ష్మణరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ డిమాండ్ పెరిగిన నేపథ్యంలో నిరంతరాయంగా కొనసాగే పరిశ్రమలకు ఒక రోజు పవర్ హాలీడే విధిస్తున్నట్లు చెప్పారు. గృహావసరాలకు నిరంతరాయంగా, వ్యవసాయానికి 9గంటల విద్యుత్ సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. సోమవారం విజయనగరం టౌన్ -1, మంగళవారం విజయనగరం టౌన్-2, బుధవారం భోగాపురం, గురువారం ఎస్.కోట, శుక్రవారం పార్వతీపురం, సాలూరు, ఐటీడీఏ పార్వతీపురం, శనివారం బొబ్బిలి టౌన్, రూరల్, ఆదివారం గజపతినగరం, రాజాంలో పవర్ హాలిడే ఉంటుందన్నారు. బల్క్ డ్రగ్ పరిశ్రమలు, ఫార్మా స్యూటికల్ పరిశ్రమలు, మెడికల్ ఆక్సిజన్ ఉత్పత్తి పరిశ్రమలు, రైస్ మిల్లులకు పవర్ హాలీడే నుంచి మినహాయింపు ఉంటుందన్నారు.

విద్యుత్ శాఖ ఏఈపై సస్పెన్షన్ వేటు

విజయనగరం క్రైమ్: అవినీతికి పాల్పడి ఏసీబీ అధికారుల కన్నుగప్పి పరారైన మక్కువ విద్యుత్ శాఖ ఏఈ శాంతారావుపై విద్యుత్ శాఖ అధికారులు సస్పెన్షన్ వేటు వేశారు. ఈ మేరకు విద్యుత్ శాఖ చీఫ్ జనరల్ మేనేజర్ (హెచ్‌ఆర్‌డీ) ఎ.రవికుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఏసీబీ కోర్టు 41ఏ నోటీస్ తీసుకుని, మరలా యథావిధిగా విధుల్లోకి వచ్చిన విషయాన్ని తెలుసుకున్న సంబంధిత విద్యుత్ శాఖ అధికారులు సస్పెండ్ చేశారు. గత నెల 27న రైతు ఈశ్వరరావు నుంచి రూ.40వేలు లంచం తీసుకుంటున్న క్రమంలో కారులో పరారై, అక్కడ నుంచి నాలుగైదు రోజులు ఏసీబీ అధికారులను ముప్పతిప్పలు పెట్టి, చివరకు అధికారులకు చిక్కడం, కోర్టులో ప్రవేశపెట్టడం, కోర్టు 41ఏ నోటీస్ ఇవ్వడం తెలిసిందే. ఈ క్రమంలో ఆయన తిరిగి విధుల్లోకి చేరడం తెలుసుకున్న అధికారులు సస్పెండ్ చేశారు.

'మహాసభలు విజయవంతం చేయండి'

విజయనగరం పూల్‌బాగ్: తెలుగుజాతి ఐక్యతను నిలబెడదాం.. అనే నినాదంతో రంగం ప్రజాసాంస్కృతిక వేదిక ఈ నెల 9, 10 తేదీల్లో కర్నూల్ జిల్లాలోని టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహించనున్న ప్రథమ మహాసభలను విజయవంతం చేయాలని రంగం విజయనగరం జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పుక్కెళ్ల షణ్ముఖరావు, గోకా రమేష్‌బాబు, డప్పు శ్రీను కోరారు. ఆదివారం స్థానిక ప్రజా గ్రంథాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఓ కళా సంస్థగా ప్రారంభమై నేడు రాష్ట్ర స్థాయి మహాసభలు నిర్వహించుకోవడం అభినందనీయమన్నారు. మహాసభల నిర్వహణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

సేవలు బాగుంటేనే.. క్లెయిమ్ చెల్లింపు

● ఫిర్యాదులు వచ్చిన క్లెయిమ్ నిలుపుదల
● ఈ ఏడాది ఇప్పటి వరకు 14 ఫిర్యాదులు
● జిల్లాలో ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు 30
● ఏడాదికి 70 వేల నుంచి 80 వేల మందికి ఆరోగ్యశ్రీ సేవలు

రాష్ట్రంలో ప్రజలకు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ద్వారా అందే సేవలు కార్పొరేట్‌కు మించి ఉండాలనే మంచి ఆశయంతో జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం తన వంతు చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా రోగులు ఆస్పత్రిలో చేరిన నుంచి డిశ్చార్జ్ అయిన వరకు వైద్యులు, సిబ్బంది తమ వంతు సేవలు సంతృప్తికరంగా అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఎక్కడా ఎటువంటి ఇబ్బంది రోగికి ఎదురు కాకుండా ఆరోగ్యకరంగా ఆస్పత్రి నుంచి ఇంటికి వెళ్లాలని సంకల్పించి అందుకు తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. గతానికి భిన్నంగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా కార్పొరేట్‌కు దీటుగా నాడు – నేడు ద్వారా అన్ని సౌకర్యాలు కల్పించింది. కావాల్సినంత మంది వైద్యులను, సిబ్బంది నియమిస్తూ ముందుకు వెళ్తోంది. ఈ పరిస్థితుల్లో రోగులు సేవల విషయంలో ఎటువంటి అసంతృప్తి చెందినా క్లెయిమ్ నిలుపుదల చేస్తోంది. తద్వారా రోగి వైద్య సేవల విషయంలో సంతృప్తి చెందేలా చర్యలు తీసుకుంది.

విజయనగరం ఫోర్ట్:

డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం పేద, మధ్య తరగతి ప్రజలకు ఓ వరం. ఈ పథకం ద్వారా జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రోగులకు సంపూర్ణ సేవలు అందించాలని నిర్ణయించింది. ఇందు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.కోట్లు ఖర్చు చేస్తోంది. రూ.వెయ్యి దాటితే చాలు ఆరోగ్యశ్రీ వర్తింపజేస్తోంది. అయితే ఈ పథకం ద్వారా చికిత్స, లేదా శస్త్ర చికిత్స చేసుకున్న రోగులు సంబంధిత ఆస్పత్రి వారు సంతృప్తికర సేవలు అందించారని సంతృప్తి వ్యక్తం చేస్తేనే క్లెయిమ్ చెల్లిస్తారు. లేదంటే నిలుపుదల చేస్తారు. ఆరోగ్యశ్రీ పథకం ఉన్న ఏ నెట్‌వర్క్ ఆస్పత్రి వారైనా రోగులకు సేవలు అందించడంలో అలసత్వం వహించినా.. లేదంటే రోగి నుంచి అదనపు వసూళ్లకు పాల్పడిన, సిబ్బంది చేతివాటం ప్రదర్శించినా సంబంధిత ఆస్పత్రులపై ఆరోగ్యశ్రీ అధికారులు చర్యలు తీసుకుంటారు.

జిల్లాలో 30 ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులు

జిల్లాలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా వైద్య సేవలు అందిస్తున్న ఆస్పత్రులు 30 ఉన్నాయి. ఆరోగ్యశ్రీ పథకం ఉన్న ప్రైవేటు ఆస్పత్రులకు సంబంధించి





ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

అభినవ్ ఆస్పత్రి, కొలపర్తి ఆస్పత్రి, సాయి పీవీఆర్, సాయి సూపర్ స్పెషాల్టీ, వెంకటరామ, ఆంధ్ర, మారుతి, పీజీ స్టార్, స్వామి ఐ ఆస్పత్రి, నెఫ్రోప్లస్, మిమ్స్, మువ్వ గోపాల, గాయిత్రి, పుష్పగిరి, తిరుమల, శ్రీనివాస్ నర్సింగ్ హోమ్, పిలిడోపియా, సౌజన్య ఆస్పత్రితో పాటు ప్రభుత్వ ఆస్పత్రులకు సంబంధించి ఎస్.కోట ప్రాంతీయ ఆస్పత్రి, సీహెచ్‌సీ చీపురుపల్లి, సీహెచ్‌సీ భోగాపురం, నెల్లిమర్ల సీహెచ్‌సీ, ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి, కురుపాం సీహెచ్‌సీ, చినమేరంగి సీహెచ్‌సీ, భద్రగిరి సీహెచ్‌సీ, సాలూరు ప్రాంతీయ ఆస్పత్రి, పార్వతీపురం జిల్లా ఆస్పత్రుల్లో ఆరోగ్యశ్రీ వైద్య సేవలు అందుతున్నాయి.

ఈ ఏడాది 14 ఫిర్యాదులు

ఆరోగ్యశ్రీ పథకం ద్వారా చికిత్స లేదా శస్త్రచికిత్స చేసుకున్న రోగులు డిశ్చార్జ్ అయిన తరువాత వారి వివరాలు సంబంధిత ఏఎస్ఎం యాప్‌లోకి వెళ్తాయి. రోగి ఇంటికి వెళ్లి చికిత్స తీసుకున్న నెట్‌వర్క్ ఆస్పత్రిలో సేవలు ఏవిధంగా అందించారు, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఏ విధంగా సేవలు అందించారు.. భోజనం ఏవిధంగా ఉంది, అదనంగా డబ్బులు ఏమైనా తీసుకున్నారా, ఆస్పత్రి వారు అందించిన సేవలు పట్ల సంతృప్తి చెందారా.. లేదా.. అని ఏఎస్ఎం యాప్‌లో అప్‌లోడ్ చేయాలి. నెట్‌వర్క్ ఆస్పత్రిలో అందించిన సేవలు పట్ల రోగి సంతృప్తి చెందకపోతే రోగి నుంచి లిఖిత పూర్వకంగా ఫిర్యాదు తీసుకుంటారు. ఇటువంటి ఫిర్యాదులు ఈ ఏడాది 14 వచ్చాయి. వీటిలో రెండు ఫిర్యాదులు డబ్బులు అదనంగా వసూలు చేశారని, మిగతావి సేవలకు సంబంధించిన ఫిర్యాదులు వచ్చాయి. వీటికి సంబంధించి క్లెయిమ్ అమౌంట్ ఆరోగ్యశ్రీ అధికారులు నిలుపుదల చేశారు.

ఫిర్యాదులపై జిల్లా క్రమశిక్షణ కమిటీ చర్యలు

నెట్‌వర్క్ ఆస్పత్రులపై రోగులు ఇచ్చిన ఫిర్యాదులపై జిల్లా క్రమశిక్షణ కమిటీ చర్యలు తీసుకుంటుంది. కమిటీ చైర్మన్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు. ఫిర్యాదు వివరాలను ఆరోగ్యశ్రీ అధికారులు కలెక్టర్‌కు నివేదిస్తారు. రూ.50 వేలులోపు ఫిర్యాదులను కలెక్టర్‌కు, 50 వేలు దాటిన ఫిర్యాదులను వైఎస్సార్ ఆరోగ్యశ్రీ ట్రస్టుకు పంపిస్తారు. వీటిపై విచారణ చేసిన అధికారులు చర్యలు తీసుకుంటారు.

పక్కాగా సేవలు



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం ఉన్న నెట్‌వర్క్ ఆస్పత్రులు రోగులకు సంతృప్తికర సేవలు అందించాలి. సేవలు సంతృప్తికరంగా లేవని ఫిర్యాదులు వస్తే చికిత్స అందించినందుకు చెల్లించాల్సిన క్లెయిమ్ నిలుపుదల చేస్తాం. పూర్తి ఉచితంగా వైద్య సేవలు అందించాలి.

– డాక్టర్ ఉప్పు అప్పలరాజు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్

రాష్ట్రాల పరిధిలోనే గ్రంథాలయాల నిర్వహణ



జన విజ్ఞాన వేదిక నూతన కార్యవర్గ ప్రతినిధులు

విజయనగరం టౌన్: గ్రంథాలయాల నిర్వహణ బాధ్యత రాష్ట్రాల పరిధిలోనే ఉండాలని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.మురళీధర్ పేర్కొన్నారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా 12వ మహాసభ స్థానిక జిల్లా పరిషత్ కాంపౌండ్‌లో ఉన్న మినిస్టీరియల్ స్టాఫ్ అసోసియేషన్ భవనంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రారంభ సభలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ప్రజారోగ్యం ప్రజల ప్రాథమిక హక్కుగా ఉండాలన్నారు. అనంతరం కృత్రిమ మేథస్సు అనే అంశంపై ఫ్రీ సాఫ్ట్‌వేర్ మూవ్‌మెంట్ ఆఫ్ ఇండియా సంస్థ నుంచి శ్రీపతిరాయ్, చంద్రయాన్ – 3, ఆదిత్య ఎల్ – 1, ఇతర రోదసీ యాత్రలు అనే అంశంపై ఎంవీఎస్ వెంకటరావు ప్రసంగించారు. రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి.రాజగోపాల్ సమన్వయంతో జరిగిన మహాసభలో జిల్లా నలుమూలల నుంచి దాదాపు 80 మంది ప్రతినిధులు పాల్గొన్నారు. రాబోయే రెండేళ్లకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డాక్టర్ ఎంవీఎన్.వెంకటరావు, సహాధ్యక్షుడిగా కె.మురళీబాబు, ఉపాధ్యక్షుడిగా పి.వేణుగోపాల్, పి.సత్యంనాయుడు, జి.నిర్మల, ప్రధాన కార్యదర్శిగా రమణ ప్రభాత్ ఎన్నికయ్యారు.

నేడు దేవుపల్లి ఉపసర్పంచ్ ఎన్నిక

బొండపల్లి: దేవుపల్లి గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్ ఎన్నిక సోమవారం ఉదయం నిర్వహించనున్నట్లు ఈఓపీఆర్‌డీ సీహెచ్.సుగుణాకరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ గ్రామ సచివాలయం వద్ద ఎన్నిక నిర్వహణకు సంబంధించి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు ఎన్నిక ప్రారంభమవుతుందని, ఆ సమయానికి ఉప సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్లను దాఖలు చేయాలని ఈఓపీఆర్‌డీ సూచించారు.

కొత్తగా మరో 5,690 పింఛన్లు

● రెండు రోజుల్లో రెండు కొత్త జాబితాలు
● జిల్లాలో ఒకే నెలలో 11వేల మందికి కొత్తగా పింఛన్లు
● జిల్లాలో 2,85,801 మందికి పెరిగిన పింఛనర్ల జాబితా



ఈర్ల పైడితల్లికి పింఛను ఇస్తున్న వలంటీరు కుసుమ

విజయనగరం అర్బన్: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడంపై వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టింది. కొత్తగా అర్హులను గుర్తించే ప్రక్రియను నిరంతర చర్యగా క్షేత్ర స్థాయి నుంచి చేపడుతుంది. ఏడాదిలో రెండుసార్లు వారి అర్హతలను ఖరారు చేసి ఆయా పథకాలను వర్తింపజేస్తారు. ఈ ఏడాది ద్వైవార్షిక వైఎస్సార్ పెన్షన్ కానుక పథకం రెండో విడత అర్హుల కొత్తవారి జాబితాను ఇటీవల ప్రకటించి వారికి పింఛన్ విడుదల చేసిన సంగతి తెలిసిందే. అయితే అర్హులైన వారు ఇంకా ఉండడంతో వారికి కూడా మంజూరు చేస్తూ ప్రభుత్వం తాజాగా మరో జాబితాను ఆదివారం విడుదల చేసింది. ఈ జాబితాలో జిల్లా నుంచి మరో 5,690 మందికి వివిధ కేటగిరి పింఛన్లు మంజూరైనట్లు డీఆర్‌డీఏ పీడీ ఎ.కల్యాణచక్రవర్తి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. తొలిత 5,690 మంది, ఆదివారం మరో 5,491 మందితో కలిపి జిల్లాలో అదనంగా మరో 11,101 మంది పింఛనర్లు పెరిగారు. దీంతో తాజాగా జిల్లా పింఛనర్ల జాబితా 2,85,801 మందికి పెరిగింది. ఈ నెల నుంచి అదనంగా రూ.2.14 కోట్లు జిల్లా పెన్షనర్ల బడ్జెట్ పెరుగుతుంది. సామాజిక భద్రత పింఛన్ల కింద ఏ ప్రభుత్వం చేయని సాయాన్ని ప్రస్తుత ప్రభుత్వం అందజేస్తోంది. పింఛన్ల సంఖ్య ప్రతి ఏటా పెరుగుతుండటంతో బడ్జెట్ సైతం పెరుగుతోంది.

ఈ నెలలో రెండుసార్లు మంజూరైన కొత్త పెన్షనర్లు

నియోజకవర్గం	మొదటి దశ పింఛనర్లు	రెండో దశ పింఛనర్లు
బొబ్బిలి	795	848
చీపురుపల్లి	686	668
గజపతినగరం	762	705
నెల్లిమర్ల	798	814
రాజాం	702	733
ఎస్.కోట	832	842
సాలూరు(మెంటాడ)	132	167
విజయనగరం	727	714

కేటగిరీ వారీగా...

పింఛనర్లు	తొలి జాబితా	రెండో జాబితా
వృద్ధులు	1,967	2,363
వీవర్స్	8	10
వితంతువులు	2,469	1,292
దివ్యాంగులు	789	1,100
అభయహస్తం	10	--
కల్లుగీత కార్మికులు	21	189
హిజ్రాల్స్	--	01
మత్స్యకారులు	18	96
ఒంటరి మహిళ	52	21
డప్పు కళాకారులు	49	278
ట్రెడిషన్ కోబ్లర్	12	140
మెడికల్	16	01
సీకేడీయూ	23	--
ఏఆర్‌టీ పెన్షన్స్	256	--
మొత్తం:	5,690	5,491

అప్రమత్తతతోనే... లంపీస్కిన్‌కు చెక్

లంపీస్కిన్.. పాడి రైతులకు భయపెడుతున్న ఓ వ్యాధి. ఈ వ్యాధి సోకిన పశువుల పట్ల ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా మృత్యువాత పడుతున్నాయి. రెండేళ్ల కిందట వెలుగులోకి వచ్చిన ఈ వ్యాధి నుంచి పశువులను కాపాడేందుకు ప్రభుత్వం టీకాలను అందుబాటులోకి తెచ్చింది. ముందస్తుగానే ఈ టీకాలను వేయడం ద్వారా పూర్తి స్థాయి కట్టడి చర్యలు చేపట్టి పాడి రైతులకు అండగా నిలిచింది. దీంతో ఈ వ్యాధి నివారణ చాలా వరకు సులువైంది. అయితే ముందుగానే వీటిని వేయడం మంచిదని పశు వైద్యులు సూచిస్తున్నారు.

● వ్యాధి సోకక ముందే టీకాలు మేలు
● జిల్లాలో టీకాల లక్ష్యం 3.02 లక్షలు



ఆవుకు సోకిన మచ్చలను చూపుతున్న రైతు

రాజాం సిటీ:

పశువుల్లో వచ్చే వ్యాధుల్లో అధిక శాతం నివారించదగ్గవే. వ్యాధి రాకముందు టీకాలతోను, వ్యాధి వచ్చిన తరువాత వైద్యుల సలహాలతో పాటు సూచించిన మందులతో పాడి రైతులు నయం చేసుకుంటున్నారు. అయితే రెండేళ్ల క్రితం మూగజీవాలకు సోకిన లంపీస్కిన్ వ్యాధి తీవ్రతరంగా మారింది. దీంతో పాడి పశువులు బక్కచిక్కిపోవడంతో పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతుంది. ఈ వ్యాధి బారిన పడిన పశువులు కూడా మృత్యువాత పడిన సంఘటనలు ఉన్నాయి. వీటిలో అధికంగా తెల్లజాతి పశువుల్లో ఈ వ్యాధి వ్యాప్తి అధికంగా కనిపిస్తుంది. వ్యాధి తీవ్రతరం కాకుండా గోట్‌ఫాక్స్ వ్యాక్సినేషన్ ను ప్రభుత్వం అందుబాటులోకి తీసుకువచ్చి టీకాల వేసే కార్యక్రమం ముమ్మరం చేసింది. జిల్లా వ్యాప్తంగా 13 ప్రాంతీయ ఆస్పత్రులు, 65 పశు వైద్యశాల లు, 40 గ్రామీణ పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో జిల్లాలో 3 లక్షల 77 వేల ఆవులు ఉన్నా యి. జిల్లాలో 3,02,450 టీకాలు లక్ష్యం కాగా ఇప్ప టివరకు సుమారు 1.35లక్షల వరకు టీకాల కార్యక్ర మం చేపట్టారు.

ఈ సీజన్‌లోనే అధికం

మున్సిపాల్టీ పరిధి కొత్తవలస గ్రామంలో బి.హరనాథరావుకు చెందిన మూడు ఆవులు ఈ నెల 2న ఒకే రోజు లంపీస్కిన్ వ్యాధి బారిన పడి మృతి చెందాయి. పశువులకు లంపీస్కిన్ (ముద్దచర్మం) వ్యాధి సోకక ముందు గ్రామంలో పశువైద్యాధికారులకు తెలియజేసినప్పటికీ పట్టించుకోకపోవడంతోనే ఈ పరిస్థితి వచ్చిందని లబోదిబోమంటున్నాడు. ఇలా ఎక్కడో ఒక చోట పశువులకు వ్యాధులు సోకడంతో మృత్యువాత పడుతున్నాయి. అధికారులు స్పందించి వ్యాక్సినేషన్ ప్రక్రియ వేగవంతం చేయాలని కోరుతున్నారు. మురుగు నీరు నిల్వ ఉన్న చోట దోమలు, ఈగలు అధికంగా ఉంటాయి. దీంతో లంపీస్కిన్ వ్యాధి వ్యాప్తి చెందే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఏడాది పొడువునా ఈ వ్యాధి లక్షణాలు ఉన్నప్పటికీ వర్షాకాలంలోనే అధికంగా కనిపిస్తుంది. దీంతో ఓ వైపు మేత కొరత, మరోవైపు వ్యాధితో బాధపడుతున్న పశువుల నుంచి పాల దిగుబడి కూడా తగ్గుముఖం పడుతుంది. వ్యాధి సోకిన పశువులను మొదట్లోనే గుర్తించి ఇతర పశువులకు సోకకుండా జాగ్రత్త పడాలి. పశువైద్యులను సంప్రదించి ముందస్తుగా టీకాలు వేయించుకుంటే ప్రమాదం తప్పేందుకు అవకాశం ఉంటుంది.

ఇలా చేస్తే ఉపశమనం

పాడి పశువులకు లంపీస్కిన్ వ్యాధి సోకిన సమయంలో సాంప్రదాయ పద్ధతులు పాటిస్తే కొంత మేర వ్యాధిని అరికట్టవచ్చు. పది తమలపాకులు, పది గ్రాముల మిరియాలు, పది గ్రాములు ఉప్పుతో లేపనం తయారుచేయాలి. దీనికి తగినంత బెల్లం కలిపి పశువులకు తినిపించాలి. మొదటి రోజు ఇలా తయారు చేసిన మందును రోజుకు మూడు సార్లు, రెండో రోజు నుంచి రెండు వారాల పాటు రోజుకు రెండు సార్లు తినిపించాలి. రెండు వెల్లుల్లి పాయలు, ధనియాలు పది గ్రాములు, జీలకర్ర పది గ్రాములు, గుప్పెడు తులసి ఆకులు, పది గ్రాముల బిరియాని ఆకులు, పది గ్రాములు మిరియాలు, ఐదు తమలపాకులు, పది గ్రాములు పసుపు, గుప్పెడు వేప ఆకులు, నేరేడు ఆకులు, వంద గ్రాముల బెల్లం తీసుకుని మందును తయారుచేసుకోవచ్చు. దీనిని పశువు ఆరోగ్యం మెరుగుపడే వరకు మొదటి రోజు నాలుగుసార్లు, రెండో రోజు నుంచి రెండు సార్లు చొప్పున తినిపించాలి. లంపీస్కిన్‌తో పశువు చర్మంపై గాయమైతే సాంప్రదాయ పద్ధతిలో మందు తయారుచేసి రాయాలి. వెల్లుల్లి పది రెక్కలు, కుప్పింటాకులు, వేపాకులు గుప్పెడు, 500 మిల్లీ గ్రాముల కొబ్బరి నూనె, గోరింటాకు, తులసి ఆకులు గుప్పెడు చొప్పున తీసుకుని బాగా మిక్సీ చేసుకుని గాయంపై పూయాలి. గాయంపై పురుగులు ఉంటే సీతాఫలం ఆకు రసం రాయడం ద్వారా త్వరగా నయం అవుతుంది.



గోట్‌ఫాక్స్ వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్న వైద్యులు

అందుబాటులో వ్యాక్సిన్

పశువులకు లంపీస్కిన్ వ్యాక్సిన్ సోకకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నాం. జిల్లాలోని అన్ని పశువులకు సంబంధించి వ్యాక్సిన్ అందుబాటులో ఉంది. ఇప్పటికే అన్ని పశువైద్య కేంద్రాల ఆధ్వర్యంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 3,02,450 వ్యాక్సినేషన్ లక్ష్యం కాగా ఇప్పటివరకు సుమారు 1.35 లక్షల వరకు పూర్తి చేశాం. ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు చేపడుతున్నాం. పాడి రైతులు వ్యాధి లక్షణాలు గుర్తిస్తే ముందస్తుగా దగ్గర్లోని పశువైద్యాధికారులకు సమాచారం అందించి సూచనలు, సలహాలు పాటించాలి.

– వై.విశ్వేశ్వరరావు, జేడీ, పశుసంవర్ధకశాఖ విజయనగరం

విద్యుత్ సరఫరాలో అంతరాయాల్ని నివారించేందుకు ప్రణాళికలు

● ఏపీఈపీడీసీఎల్ సీఎండా పృథ్వీతేజ్ ఇమ్మడి

సాక్షి విశాఖపట్నం : గృహ, వ్యవసాయ విద్యుత్ వినియోగదారులకు మెరుగైన విద్యుత్‌ను సరఫరా చేసేందుకు ఏపీఈఆర్‌సీ ఆదేశాల మేరకు అవసరమైన ప్రణాళికలు అమలు చేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి స్పష్టం చేశారు. గృహ, పారిశ్రామిక రంగాలతో పాటు వ్యవసాయానికి 9 గంటల విద్యుత్తును సరఫరా చేసేందుకు విద్యుత్తు పంపిణీ సంస్థలు, ప్రభుత్వం కృషి చేస్తున్నప్పటికీ ప్రతికూల వాతావరణ పరిస్థితుల కారణంగా ఏర్పడిన విద్యుత్ కొరత కొంత ఇబ్బందికరంగా మారిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోజువారీ విద్యుత్తు సరఫరా అవసరాలకు ప్రస్తుతం 230 మిలియన్ యూనిట్ల విద్యుత్తు అవసరం వుండగా థర్మల్, హైడల్, గ్యాస్, పవన, సోలార్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాల ద్వారా 190 మిలియన్ యూనిట్ల విద్యుత్తు మాత్రమే ఉత్పత్తి అవుతుండగా ఇంకా 40 మిలియన్ యూనిట్ల వరకూ కొరత వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని వివరించారు. ఈ నేపథ్యంలో గృహ, వ్యవసాయ రంగాల అవసరాలకు తగిన ప్రాధాన్యమిచ్చేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అదేవిధంగా లోటు వర్షపాతం కారణంగా వ్యవసాయ సాగు కోసం ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొన్నారు. రాష్ట్రంలో విద్యుత్ సరఫరా, డిమాండ్ స్థితి, ఎక్స్ఛేంజీల నుంచి విద్యుత్ కొనుగోళ్ల పరిమాణం వాటి ప్రస్తుత ధరల్ని పరిశీలించిన కమిషన్ రాష్ట్రంలోని పరిశ్రమల విద్యుత్ వినియోగంపై కొన్ని నియంత్రణ చర్యలను చేపట్టేందుకు అనుమతించినట్లు వివరించారు. ఇందులో భాగంగా సంస్థ పరిధిలో నిరంతర ప్రాసెసింగ్ పరిశ్రమలు తమ రోజువారీ విద్యుత్ వినియోగంలో 30 శాతం కాంట్రాక్టు లోడులో తగ్గించుకొనే విధంగా ఆయా పరిశ్రమలు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎండీ పృద్వీతేజ్ సూచించారు. ఇతర పరిశ్రమలు ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటలలోపు ఒక షిఫ్ట్ మాత్రమే పనిచేయాలని, సాయంత్రం 6 తరువాత విద్యుత్ వినియోగానికి అనుమతించేది లేదని స్పష్టం చేశారు. వారానికి ఒకరోజు పవర్ హాలిడేను కూడా అమలు చేయాలని సూచించారు. పవర్ హాలిడేను జిల్లాల వారీగా రెగ్యులేట్ చేస్తామని, ఈ నెల 5 నుంచి 15 వరకూ రెండు వారాల పాటు పవర్ హాలిడే అమల్లో ఉంటుందని వివరించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయాలపై ఏపీఈపీడీసీఎల్ టోల్‌ఫ్రీ నంబర్ 1912కు ఫోన్ చేయాలని సీఎండీ సూచించారు.

క్లుప్తంగా

కోటదుర్గమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఘటాలతో అమ్మవారి దేవస్థానంకు చేరుకున్న భక్తులు

పాలకొండ రూరల్: కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారం పాలకొండ కోటదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఇటీవల వివాహాలు చేసుకున్న నూతన వధూవరులు అమ్మవారికి ముర్రాటలు, ఘటాలు సమర్పించి మొక్కులు చెల్లించారు. అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఉన్న చెట్టుకు జలాభిషేకం చేశారు. ఘటాల ఊరేగింపులో కళాకారుల సాంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకలు, ప్రసాదాలను అర్చకులు దార్లపూడి లక్ష్మీప్రసాద శర్మ అమ్మవారికి నివేదించారు.

కూలిన పెంకుటిల్లు



పెదకాదలో కూలిన పెంకిటిల్లు వద్ద వివరాలు సేకరిస్తున్న వీఆర్వో సింహాచలం

దత్తిరాజేరు: మండలంలోని పెదకాద గ్రామంలో శనివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి నిరుపేద పావాడ పైడితల్లి ఇల్లు కూలిపోయినట్లు ఉప సర్పంచ్ సామిరెడ్డి ఈశ్వరరావు ఆదివారం తెలిపారు. అయితే అదృష్టవశాత్తు ఇంటిలోని వారు అప్రమత్తంగా ఉండడంతో ఎలాంటి ప్రాణ,ఆస్తినష్టం జరగలేదని అన్నారు. ఈ విషయమై తహసీల్దార్ గురుమూర్తికి సమాచారం అందించడంతో వీఆర్వో సింహాచలం గ్రామానికి వచ్చి సర్పంచ్ గుజ్జ మంగను కలిసి వివరాలు సేకరించినట్లు ఉపసర్పంచ్ తెలిపారు.

గోడకు బీటలు



డాబా ఇంటికి బీటలు వారిన గోడ

సీతానగరం: మండలంలోని గాదెలవలసలో శనివారం రాత్రి పిడుగు పడడంతో గ్రామానికి చెందిన బి.తిరుపతిరావు ఇంటి మూడవ అంతస్తులో గోడ బీటలు వారడంతో పాటు కేబుల్, సోలార్ వైర్లు మాడిపోయాయి. ఈ మేరకు బాధితుడు తిరుపతిరావు ఆదివారం ఉదయం తెలియజేశారు. శనివారం రాత్రి ఉరుములు పిడుగులుతో కురిసిన వర్షం కారణంగా ఇంటికి దగ్గరలో పిడుగులు పడ్డాయనుకున్నామని ఉదయం లేచి తమ ఇంటి మూడో అంతస్తులో చూడగా గోడ బీటలు వారిందని చెప్పాడు. అగ్గి పిడుగు పడడంతో తిరుమల కేబుల్ నెట్‌వర్క్‌కు సంబంధిచిన వైర్లు, విద్యుత్ వైర్లు కాలి పోయినట్లు తెలియజేశారు. తిరుపతిరావు కుటుంబాన్ని వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బి.శ్రీరాములు, జెడ్పీటీసీ ఎం.బాబ్జీ పరామర్శించారు.

గడ్డిమందు తాగి వ్యక్తి ఆత్మహత్య



పాపినాయుడు మృతదేహం

బలిజిపేట: వంగర మండలంలోని కె.చాకరాపల్లి గ్రామానికి చెందిన వై.పాపినాయుడు(45) గడ్డిమందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై పాపారావు ఆదివారం తెలిపారు. మృతుడి కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసినట్లు చెప్పారు. ఫిర్యాదు మేరకు వివరాలిలా ఉన్నాయి. పాపినాయుడికి మద్యం తాగే అలవాటు ఉంది. దీనికి తోడు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. వృత్తిరీత్యా డ్రైవర్ అయిన పాపినాయుడు శనివారం సాయంత్రం మూర్ఛ టాబ్లెట్‌లు నారాయణపురం నుంచి తీసుకువస్తానని చెప్పి బయటకు వచ్చాడు. తిరిగి ఇంటికి వెళ్తూ నారాయణపురం- కె.చాకరాపల్లి గ్రామాల మధ్య గడ్డిమందు తాగేశాడు. ఇంటికి వెళ్లి తండ్రి, భార్యతో ఈ విషయం చెప్పగా వారు వెంటనే శ్రీకాకుళం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకువెళ్లగా చికిత్స పొందుతూ శనివారం అర్ధరాత్రి దాటిన తరువాత మృతిచెందాడు.

జ్వరాలతో జాగ్రత్త..!



జ్వరాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగులు

- జిల్లాలో భారీగా కేసుల నమోదు
- సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో పెరిగే ఆస్కారం
- అదుపు చేసేందుకు ముందస్తు చర్యలు
- ఇంటింటా సర్వేచేస్తున్న వైద్య సిబ్బంది

విజయనగరం ఫోర్ట్: జిల్లాలో జ్వరాల వ్యాప్తి మొదలైంది. పల్లెలు పట్టణాల్లో జనం జ్వరాల బారిన పడుతున్నారు. చికిత్స కోసం ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రులకు రోగులు వస్తున్నారు. ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం వద్ద కొంతమంది వైద్యం చేయించుకుంటుండగా, మరి కొంతమంది పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలకు వెళ్లి చికిత్స పొందుతున్నారు. మలేరియా, డెంగీ వంటి జ్వరాలు సోకిన వారు సర్వజన ఆస్పత్రిని ఆశ్రయిస్తున్నారు. జ్వరాల వ్యాప్తి అధికంగా ఉన్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వ్యాధుల వ్యాప్తికి కట్టడి చర్యలతో పాటు వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. మరోవైపు జ్వర పీడితులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.

జిల్లాలో 1,27,655 జ్వరాల నమోదు

జిల్లాలో జ్వరాల వ్యాప్తి మొదలు కావడంతో జనవరి నెల నుంచి ఆగస్టు నెలాఖరు నాటికి 1,27, 655 కేసులు నమోదయ్యాయి. అలాగే మలేరియా 241, డెంగీ 260 కేసులు నమోదయ్యాయి.

వైద్యసిబ్బంది సర్వే

జిల్లాలో వైద్యసిబ్బంది జ్వర పీడితులను గుర్తించేందుకు సర్వే చేస్తున్నారు. ఆశవర్కర్లు, ఏఎన్‌ఎం, వలంటీర్‌లు ఇంటింటికి వెళ్లి ఆరా తీస్తున్నారు. జ్వర పీడితులు ఉంటే వారి వివరాలు యాప్‌లో నమోదు చేస్తున్నారు. అదేవిధంగా జ్వర పీడితులకు ఎంఎల్‌హెచ్‌పీలు మలేరియా, డెంగీ పరీక్షలు నిర్వహిస్తున్నారు. వచ్చే రెండు నెలలు కీలకం సెప్టెంబర్, అక్టోబర్ నెలల్లో జిల్లాలో వ్యాధుల వ్యాప్తి మరింత పెరిగే పరిస్థితి ఉంది. జిల్లాలో ప్రస్తుతం వైరల్, టైఫాయిడ్, మలేరియా, డెంగీ, డయేరియా వ్యాప్తి చెందుతున్నాయి.



రాకోడు పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు చేస్తున్న టెక్నీషియన్

అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ

వ్యాధుల పట్ల వైద్యారోగ్య శాఖ అప్రమత్తమైంది. వ్యాధులు ప్రబలకుండా పంచాయతీ రాజ్‌శాఖ సమన్వయంతో పారిశుధ్య చర్యలు చేపడుతుంది. అలాగే తాగునీటి వనరుల్లో క్లోరినేషన్ చేయిస్తోంది. అదేవిధంగా దోమలు వృద్ధి చెందకుండా కాలువల్లో స్ప్రేయింగ్ చేయిస్తున్నారు. జ్వరాల వ్యాప్తి అధికంగా ఉన్న గ్రామాల్లో ఫాగింగ్ చేయిస్తూ..ఇంటి పరిసరాలు, ఇంటిలో ఉండే ఫ్రిజ్‌లు ఏసీలు ,కూలర్లలో నీరు లేకుండా చూసుకోవాలని అవగాహన కల్పిస్తున్నారు. జ్వరాలు, డయేరియా ప్రబలిన గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

వ్యాధుల వ్యాప్తిపై అప్రమత్తం



వ్యాధులు ప్రబలకుండా గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు, క్లోరినేషన్ చేపడుతున్నాం. జ్వర పీడితులను గుర్తించేందుకు వైద్యసిబ్బంది సర్వే చేస్తున్నారు. వైఎస్సార్ విలేజ్ క్లినిక్, పీహెచ్‌సీల్లో వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తున్నాం.

– డాక్టర్ ఎస్.భాస్కరరావు, డీఎంహెచ్‌ఓ

ఉపాధ్యాయుల అక్రమ బదిలీలను రద్దు చేయాలి

- యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు

విజయనగరం అర్బన్: ఉద్యోగ, ఉపాధ్యాయ హక్కులకు భంగం కలిగించే అక్రమ బదిలీలను రద్దు చేయాలని యూటీఎఫ్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఆదివారం స్థానిక యూటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశ మందిరంలో జిల్లా కమిటీ నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు తీర్మానించించారు. ఈ సందర్భంగా బదిలీల కౌన్సెలింగ్ సమయంలో ఉపాధ్యాయులకు అదనంగా ఉన్న ఖాళీలను చూపించమంటే ఖాళీలు లేవని తప్పుడు సమాచారం ఇచ్చి ఆయా స్థానాలలో అక్రమ బదిలీలతో నింపడాన్ని సమావేశంలో ఖండించారు. జిల్లా అధ్యక్షుడ జేఆర్ఎల్ పట్నాయక్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు, జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎ.సత్యశ్రీనివాస్, జిల్లా సహాధ్యక్షులు వి.ప్రసన్నకుమార్, జి.పార్వతి, కోశాధికారి సీహెచ్.భాస్కరరావు, జిల్లా కార్యదర్శులు కె.ప్రసాదరావు, సీహెచ్.తిరుపతినాయుడు, ఎన్.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ పోటీల్లో రేణుశ్రీ సత్తా



బ్యాడ్మింటన్ పోటీల్లో సిల్వర్ మెడల్ సాధించిన రేణుశ్రీ

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరుగుతున్న అండర్-15 బ్యాడ్మింటన్ పోటీల్లో జిల్లాకు చెందిన యవర్ణ రేణుశ్రీ సత్తా చాటింది. విశాఖ వేదికగా రెండు రోజులుగా జరుగుతున్న పోటీల్లో సింగిల్స్ విభాగంలో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారిణి సిల్వర్‌మెడల్ కైవసం చేసుకుంది. ఈ సందర్భంగా రేణుశ్రీని జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ చైర్మన్ కోలగట్ల వీరభద్రస్వామి, అధ్యక్షుడు ఇందుకూరి రఘురాజు, ఉపాధ్యక్షుడు డాక్టర్ వీఎస్ ప్రసాద్, ప్రధాన కార్యదర్శి వై.కుసుంబచ్చన్‌లు అభినందించారు.

బైక్ చోరీ

జామి: మండలకేంద్రం జామి చెంబురివారి వీధిలో గ్రామానికి చెందిన పి.వి.భాస్కర్ పల్సర్-180 బైక్‌ను ఇంటిముందు పార్క్ చేయగా రెండు రోజుల క్రితం చోరీకి గురైంది. గుర్తు తెలియని వ్యక్తులు బైక్‌ను అపహరించగా బాధితుడు భాస్కరరావు గాలించిన అనంతరం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఎనీమియా బాధితురాలికి రూ.10 వేలు పింఛన్

వీరఘట్టం: స్థానిక బీసీ కాలనీకి చెందిన టొంపల పుష్పలత ఎనీమియాతో బాధపడుతుండడంతో ప్రభుత్వం రూ.10 వేలు పింఛన్ మంజూరు చేసింది. ఆమె పరిస్థితిని వైద్యులు ప్రభుత్వానికి గత నెలలో నివేదించారు. దీనికి స్పందించిన ప్రభుత్వం పుష్పలతకు వెంటనే రూ.10 వేలు పింఛన్ మంజూరు చేసింది. ఈ పింఛన్‌ను వలంటీరు జీవన్‌తో కలిసి మాజీ ఎంపీటీసీ బొమ్మాళి హేమలత బాధితురాలికి ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బొడ్డూరు రామ్మూర్తి, కడగల రమణ తదితరులు పాల్గొన్నారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతూ పాలకొండ ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మహిళకు వలంటీర్ దిలీప్ ఆస్పత్రికి వెళ్లి దివ్యాంగుల పింఛన్ రూ.3 వేలు అందజేశాడు.



ఎనీమియాతో బాధపడుతున్న యువతికి రూ.10 వేలు పింఛన్ అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

ప్రభుత్వ ఆస్పత్రుల్లో బయోమెట్రిక్

- వైద్యసిబ్బంది హాజరు తప్పనిసరి
- అటెండెన్స్‌తో వేతనానికి అనుసంధానం
- ఈ నెల నుంచి కచ్చితంగా అమలు

పాలకొండ రూరల్: ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది సమయపాలన పాటించి..ప్రజలకు మరింత మెరుగ్గా వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో జిల్లా ఆస్పత్రితో పాటు ఇతర ఆస్పత్రుల్లో పనిచేస్తున్న వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది వందశాతం విధులకు హాజరయ్యేలా ఉన్నతాధికారులు చర్యలు చేపడుతున్నారు. ఇందుకోసం అన్ని ఆస్పత్రుల్లో అటెండెన్స్ రిజిస్టర్, ఆధార్ ఎనేబుల్ బయో మెట్రిక్ అటెండెన్స్ సిస్టం (ఏఈబీఏఎస్), ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ (ఎఫ్‌ఆర్‌ఎస్) అమలులోకి తెచ్చారు. ప్రస్తుతం అన్ని చోట్ల ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ అమలులో ఉంది. ఇప్పుడు అన్ని ఆస్పత్రుల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్‌ను కూడా అమలులోకి తెచ్చారు. దీని వల్ల వైద్యులు, సిబ్బంది పూర్తి స్థాయిలో అందుబాటులో ఉండేలా చేసి ఆస్పత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యం అందుంచాలని ప్రభుత్వ సంకల్పించింది.

శతశాతం హాజరు లక్ష్యం.

ప్రస్తుత నెల నుంచి శతశాతం బయోమెట్రిక్ హాజరు ఉండాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశించారు.ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ కార్యాలయం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి, బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ కచ్చితంగా అమలు చేయాలని ఆస్పత్రుల సూపరింటెండెంట్లకు ఆదేశాలు అందాయి. ఇందులో భాగంగా అటెండెన్స్‌కు జీతాలను అనుసంధానం చేశారు. ఇకపై వైద్యారోగ్య శాఖలో అందరికీ ఎస్ఆర్ఎస్ హాజరు ప్రకారం జీతాలు చెల్లిస్తామని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఆలస్యం అయినా, ఎస్ఆర్ఎస్ వేయకపోయినా తొలుత లీవుగా పరిగణిస్తారు. ఆ తర్వాత అన్ని సెలవులూ పూర్తయితే నెలవారీ జీతంలో కోత విధించడానికి వెనుకాడవద్దని, వాటిని ఆస్పత్రుల సూపరింటెండెంట్లు, సంబంధిత హెచ్ఓడీలు పర్యవేక్షించాలని ప్రభుత్వం స్పష్టం చేసింది. ఈ హాజరును డిస్ట్రిక్ట్ మాన్యువల్ (డీఎంఓ) కమిటీ కూడా పర్యవేక్షిస్తుంది. ఎవరైనా గైర్హాజరైనా, ఆలస్యమైనా సంబంధిత ఉద్యోగులకు సమాచారం వెళ్లేలా అలర్ట్ మెకానిజం కూడా సిద్ధం చేశారు.



పాలకొండ ఏరియా ఆస్పత్రిలో ఎఫ్ఆర్ఎస్ విధానంలో హాజరు వేస్తున్న సిబ్బంది

ఇవీ మార్గదర్శకాలు..


రోజూ ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 వరకు వైద్యులు, నర్సింగ్, పారా మెడికల్ సిబ్బంది తప్పనిసరిగా విధి నిర్వహణలో భాగంగా ఆస్పత్రుల్లో ఉండాలి. ఉదయం కార్యాలయానికి వచ్చిన వెంటనే అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేయాలి. అ తర్వాత ఆధార్ ఎనేబుల్ బయోమెట్రిక్ అటెండెన్స్ సిస్టమ్ (ఏఈబీఏఎస్)లో అయితే రోజుకు మూడు సార్లు బయోమెట్రిక్ వేయాలి. ఉదయం 9 గంటలకు ఒకసారి డ్యూటీ పూర్తయిన తర్వాత, సాయంత్రం 4 గంటలకు మరోసారి బయోమెట్రిక్ వేయాల్సి ఉంది. అదే ఫేషియల్ రికగ్నైజేషన్ సాఫ్ట్‌వేర్ (ఎస్ఆర్ఎస్)లో ఉదయం 9 గంటలకు, మధ్యాహ్నం ఒంటి గంటకు, సాయంత్రం నాలుగు గంటలకు హాజరు వేయాలి. ఈ పద్ధతిలో ఉద్యోగుల సెల్‌ఫోన్ సొంతంగా హాజరు నమోదు చేసుకునేలా యాప్ సిద్ధం చేశారు. దీనివల్ల సిబ్బంది ఎక్కడ ఉన్నారో లొకేషన్ కూడా నమోదవుతుంది. తద్వారా ఎక్కడి నుంచి హాజరు వేస్తున్నారో సులువుగా తెలుస్తుంది.

పక్కాగా అమలు చేస్తాం



ప్రభుత్వ ఆదేశాల ప్రకారం వైద్యులు, ఇతర సిబ్బంది హాజరుపై నిఘా పెంచుతాం. విధులకు హాజరైన వారు తప్పనిసరిగా ఎస్ఆర్ఎస్ ద్వారా హాజరు వేసుకోవాల్సి ఉంది. ఇప్పటికే ఆస్పత్రిలో హాజరు ప్రక్రియను ప్రయోగాత్మకంగా అమలు చేస్తున్నాం. ఈ మేరకు అందరికీ సర్క్యులర్ ద్వారా తెలియజేశాం. సిబ్బందిలో జవాబుదారీ తనం మరింత పెంచేందుకు ఈ విధానాన్ని ప్రభుత్వ యంత్రాంగం అందుబాటులోకి తీసుకువచ్చింది. – జి.నాగభూషణరావు, ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్, పాలకొండ

మూడుసార్లు హాజరు తప్పనిసరి



ఎస్ఆర్ఎస్ ద్వారా అందరూ తప్పనిసరిగా అటెండెన్స్ వేసుకోవాలి. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇలా హాజరు వేసుకుంటేనే జీతం వస్తుంది. ఈ క్రమంలో ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు నిర్దేశిత ప్రాంతాల్లో విధులు నిర్వహిస్తూ ఉండాలి. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం మూడుసార్లు ఎస్ఆర్ఎస్ ద్వారా హాజరు వేసుకోవడం తప్పనిసరి. జిల్లాలో ప్రభుత్వ రంగానికి చెందిన 42 ఆస్పత్రుల పరిధిలో 80 మంది వైద్యులు, వివిధ హోదాల్లో విధులు నిర్వహిస్తున్న సిబ్బంది దాదాపు 947 మంది ఉన్నారు. వారంతా కచ్చితంగా ప్రభుత్వ ఆదేశాలు పాటించాల్సిందే.

– బగాది జగన్నాథరావు, డీఎంహెచ్ఓ, పార్వతీపురం మన్యం జిల్లా

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిక



వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

- పార్టీ తీర్థం పుచ్చుకున్న 90 కుటుంబాలు
- కండువాలు వేసి ఆహ్వానించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న ప్రజా సంక్షేమ పాలన పట్ల ఆకర్షితులై టీడీపీకి చెందిన కుటుంబాలు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరడం అభినందనీయమని రాష్ట్ర శాసనసభ డిప్యూటీ స్పీకర్, కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం విజయనగరం మండలంలోని నారాయణపురం గ్రామానికి చెందిన టీడీపీ గ్రామ అధ్యక్షుడు ముల్లు పైడినాయుడుతో పాటు 30 టీడీపీ కుటుంబాలు, సర్పంచ్ ఎడ్ల ఈశ్వరరావు ఆధ్వర్యంలో టీడీపీ వార్డు మెంబర్ గడదేసి అప్పలనాయుడుతో పాటు 30 కుటుంబాలు, వైఎస్సార్‌సీపీ నాయకులు పైలా గురుమూర్తి, గండబోయిన వెంకటరమణ, నక్కాన నారాయణరావు, వార్డు మెంబర్ల ఆధ్వర్యంలో మరో 30 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నివాసంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు నడిపేన శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో 90 కుటుంబాల వారికి వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీ కండువాలు వేసిన కోలగట్ల వీరభద్ర స్వామి వారందరినీ సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో జొన్నవలస పీఏసీఎస్ అధ్యక్షుడు కెల్ల త్రినాథ్, వైఎస్సార్‌సీపీ యువజన విభాగం మండల నాయకులు సువ్వాడ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులు స్వయం సంపాదకులు కావాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సెంట్రల్ విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి



దివ్యాంగులకు అందజేసిన బడ్డీలు, కృత్రిమ అవయవాలు

- ఎస్ఐడీబీఐ డీజీఎం సౌరభ్‌బాజపాయ్
- 30 మందికి రూ.25 లక్షలతో బడ్డీలు, ట్రైసైకిల్స్ పంపిణీ

కొత్తవలస: దివ్యాంగులు స్వయం సంపాదకులు కావాలని, ఆర్థికంగా ఎదుగేందుకు భారతీయ చిన్న పరిశ్రమల అభివృద్ధి బ్యాంక్ (ఎస్ఐడీబీఐ) కృషి చేస్తున్నట్లు ఆ సంస్థ డీజీఎం సౌరభ్‌బాజపాయ్ అన్నారు. ఈ మేరకు మండలంలోని మంగళపాలెం గ్రామం సమీపంలో గల శ్రీగురుదేవా చాకిటబుల్ ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్‌బాబు ఆధ్యక్షతన ఆదివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రూ.25 లక్షలతో 30 మంది దివ్యాంగులకు బడ్డీలు(పాన్‌షాపులు), వీల్ చైర్స్, ట్రై సైకిల్స్ తదితర సామగ్రిని స్వావలంబన పథకంలో భాగంగా అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు ఆర్థికంగా ఎదిగిన రోజు మరొకరిపై ఆధారపడాల్సిన అవసరం ఉండదన్నారు.అందుకు తగ్గ పూర్తి సహకారం తాము అందిస్తామని చెప్పారు. సాయం పొందిన వారు మరొకరికి సాయం చేసే స్థాయికి ఎదగాలని సూచించారు.

గురుదేవా దివ్యాంగులకు వరం

ముఖ్యఅతిథిగా హాజరైన కేంద్ర విజిలెన్స్ మాజీ కమిషనర్ కేవీ చౌదరి మాట్లాడుతూ గురుదేవా చారిటబుల్ ట్రస్టు దివ్యాంగుల పాలిట వరం అని ప్రశంసించారు. ట్రస్టు చైర్మన్ జగదీష్‌బాబు ఆయన జీవితాన్ని దివ్యాంగుల సేవలకే అంకితం చేశారని కొనియాడారు. ట్రస్టు సేవలు గడిచిన 23 సంవత్సరాలుగా ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ,కర్నాటక రాష్ట్రాల్లో అందజేస్తూ సుమారు లక్షమంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను అందించడం గొప్పవిషయమని అభినందించారు. పరిశ్రమలకు వచ్చే లాభాల్లో రెండు శాతం నిధులు సీఎస్ఆర్ రూపంలో ఖర్చు చేయాల్సి ఉందని రిలయన్స్ పరిశ్రమ ఏడాదికి సుమారు రూ.1200 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. అలాంటి వారు ట్రస్టుకు సహకరించాలని కోరారు.

స్టీల్ ఎక్స్ఛేంజ్ ఆవరణలో పవర్ ప్లాంట్

కార్యక్రమానికి హాజరైన స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారం సీఎండీ బండి సురేష్‌కుమార్ మాట్లాడుతూ త్వరలో ఎల్.కోట మండలం శ్రీరాంపురం గ్రామం సమీపంలో గల స్టీల్ ఎక్స్ఛేంజ్ ఇండియా లిమిటెడ్ కర్మాగారం ఆవరణలో ఒక మిలియన్ టన్ను పవర్ ప్లాంట్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. తద్వారా సుమారు 10వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. దివ్యాంగులు, నిరాదరణకు గురైనవారు, పేదలకు గురుదేవా చారిటబుల్ ట్రస్టు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివన్నారు. ట్రస్టుకు తమ కర్మాగారం నుంచి పూర్తిగా సహకరిస్తామని తెలిపారు. ట్రస్టుకు వచ్చి వెళ్లేందుకు దివ్యాంగులను తరలించేందుకు అవసరమైన ఈ వాహనాలను అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఐడీబీఐ అసోసియేట్ మేనేజర్ శ్రీస్థితాకుర్, హైవీ వాటర్ బోర్డు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఎస్.సత్యకుమార్, ఎస్ఐడీబీఐ మాజీ సీఎండీ వీఎస్వీ రావ్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో ఆవు, దూడ మృతి



కుక్కల దాడిలో మృతి చెందిన దూడ

బొండపల్లి: మండలంలోని కొవ్వాడపేట గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో ఆవుతో పాటు దూడ అక్కడికక్కడే మృతిచెందాయి. ఆదివారం జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పోట్నూరు బంగారు నాయుడి ఆవుతో పాటు దూడను పశువుల పాకలో కట్టగా ఊరిలోని కుక్కలు ఒక్కసారిగా దాడి చేసి తీవ్రంగా గాయ పరచడంతో అవి మృత్యువాత పడ్డాయి.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 475.00
విజయనగరం	రూ. 479.00
శ్రీకాకుళం	రూ. 479.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	60,380-00
బంగారం(22సి. 10గ్రా.)	55,350-00
వెండి (కిలో)	80,000-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹144	₹258	₹ 268